క్లుప్తంగా

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

మదనపల్లె సిటీ : పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.ఓబులేసు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఉచిత శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషులో ఉన్న స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇవ్వబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దండు మారెమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : కురబలకోట మండలం ముదివేడు దండు మారెమ్మ జాతరకు శని, ఆదివారాల్లో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె-ముదివేడు మధ్య 20 బస్సులు, ముదివేడు- కోసువారిపల్లె మధ్య ఒక బస్సు నడపనున్నట్లు పేర్కొన్నారు. కదిరి తేరు పుస్కరించుకుని శనివారం ఐదు బస్సులు అదనపంగా నడపడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

వైభవంగా పూలంగిసేవ



రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు శ్రీగట్టు వెంకటరమణస్వామి తిరునాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి పూలంగిసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం భక్తుల గోవిందనామస్మరణలతో మారుమోగింది.

ఏప్రిల్ 1న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

పీలేరు రూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ కంచంవారిపల్లె వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఏప్రిల్ 1న విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవచనం, సోమవారం ఉదయం 9 గంటలకు కుంభాభిషేకం, ప్రాణప్రతిష్ట, దర్శనం, తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమం ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కనుల పండువగా ద్రౌపది కల్యాణ మహోత్సవం

కలకడ : కనుల పండువగా ద్రౌపది కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. బాలయ్యగారిపల్లె మాజీ సర్పంచ్ రామయ్య ధర్మకర్తగా కలకడలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో బాగంగా శుక్రవారం ద్రౌపది-పంచపాండవుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేశారు. ధర్మకర్త రామయ్య దంపతులు ద్రౌపది తరుపున, వెంకట్రమణనాయుడు దంపతులు పంచపాండవుల తరపున వివాహ మహోత్సవంలో పాల్గొని కార్యక్రమాలు నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

పీలేరు రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పీలేరు శివారు ప్రాంతంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో వాహనాల్లో అధిక మొత్తంలో నగదు, మద్యం తరలించరాదన్నారు. డబ్బులకు సంబంధించి సరైన రసీదులు, రికార్డులు లేకపోతే స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

సారా విక్రేత అరెస్టు

కలకడ : మండలంలో 20 లీటర్ల నాటుసారా సీజ్ చేసి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామక్రిష్టారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని దిగువ తండపంచాయతీ ఎగువతండ గ్రామానికి చెందిన సేవలనాయక్ కుమారుడు చలపతినాయక్ నాటుసారా అమ్ముతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. స్థానిక మారెమ్మ గుడి వద్ద అతడి వద్ద సారా ఉండటం గుర్తించి అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుగా రానామిట్ట

బి.కొత్తకోట : మండలంలోని రానామిట్ట వద్ద ఉన్న కర్ణాటక సరిహద్దు పోలీసు చెక్‌పోస్టును ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుగా అధికారులు మార్చారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకొన్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు పోలీసులు మాత్రమే చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తూ అక్రమ మద్యం తరలింపు, నిషేధితాలను అడ్డుకుని కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేస్తున్నారు. ఇకపై చెక్‌పోస్టులో వాణిజ్య పన్నుల శాఖ, ఎస్ఈబీ, పోలీసు శాఖలకు చెందిన అధికారులు విధులు నిర్వర్తిస్తారు. ఈ శాఖల పరిధికి చెందిన అంశాలను ఉల్లంఘించిన వారిపైన ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి

- కలికిరి ప్రజల రుణం తీర్చుకోలేనిది
- ఇక్కడి ప్రజల కష్టాలు తీర్చడం నా బాధ్యత
- కూటమికి ఓటు వేస్తే ఉత్తరప్రదేశ్ ఇబ్బందులు ఇక్కడా తప్పవు
- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

కలికిరి : కష్ట నష్టాలకు ఓర్చుకుని తన వెంట నడిచిన కలికిరి ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని రాజంపేట పార్లమెంటు సభ్యులు, ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. కలికిరి ప్రాంత ప్రజల కష్టాలు తీర్చడం బాధ్యతగా తీసుకుని ఏ కష్టంతో తన వద్దకు వచ్చినా తన వంతుగా పరిష్కరించానని ఎంపీ గుర్తుచేశారు. కలికిరి పట్టణం కలకడ రోడ్డులోని హేమాచారి కళ్యాణ మండపంలో శుక్రవారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అన్నదమ్ములు ఇద్దరూ చెరో పార్టీతో వస్తున్నారని, వారిని ఎదుర్కొని విజయం సాధిద్దామని నల్లారి సోదరులనుద్దేశించి అన్నారు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, ఏలాంటి సమయం, కష్టంలోనైనా తాను ముందుంటానన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో మైనారీలకు ఇబ్బందులు తప్పవని, ఉత్తర ప్రదేశ్‌లో మైనార్టీలను ఇబ్బందులకు గురిచేసినట్లు రాష్ట్రంలోనూ చేస్తారన్నారు. యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకిస్తామన్నారు. అసెంబ్లీ, పార్లమెంటులలో బిల్లు పెడితో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అనుకూలంగా ఓటు వేస్తుందని మైనార్టీ సోదరులు గుర్తించుకోవాలన్నారు. 2014, 2019 ఎన్నికలలో గెలిపించినట్లే 2024 ఎన్నికలలోనూ రాజంపేట పార్లమెంటుతో పాటు పీలేరు నియోజకవర్గంలోనూ మరోసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త, బూత్ కన్వీనర్‌లో ప్రణాళిక బద్ధంగా పనిచేయలని పిలుపునిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల మద్దతుతోనే గెలుపు

నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మద్దతుతోనే 2014, 2019 ఎన్నికలలో గెలవడం జరిగిందని, తిరిగి వారి మద్దతుతో 2024 ఎన్నికలలోనూ గెలవడం జరుగుతుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరిందని గుర్తుచేశారు. ఎన్నికల సమయం దగ్గర ఉన్నందున నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రయోజనాలను ఓటర్లకు వివరించి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామ పంచాయతీల వారిగా సమీక్ష :

మండల పరిధిలోని ప్రతి గ్రామ పంచాయతీ నుంచి విచ్చేసిన నాయకులు, కార్యకర్తలతో ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ గెలుపు ప్రణాళిలు, ఏప్రిల్ 2న అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరుగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సమావేశం విజయవంతంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని 14 గ్రామా పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమాలలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మెన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ ఛైర్మన్ తిమ్మారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీఫ్ రెడ్డి, నియోజవర్గ పరిశీలకులు సహదేవ రెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఫూమొహిద్దీన్, రాహుల్‌చక్రవర్తిరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, రత్నశేఖర్‌రెడ్డి, ఎంఆర్‌జీ, శివాజీ, శ్రీకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ జీఎస్ ప్రశాంత్

పెద్దతిప్పసముద్రం : ములకలచెరువు పోలీస్ సర్కిల్ పరిధిలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపడుతున్నామని ట్రైనీ డీఎస్పీ జీఎస్ ప్రశాంత్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లకు పాల్పడకుండా, ప్రేరేపించకుండా ఉండేలా తాము ప్రజలతో మమేకమై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదే విధంగా రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సర్కిల్ పరిధిలోని నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో 400 మందికి పైగా బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అంతేగాక సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. అనంతరం కర్ణాటక సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. మద్యం, డబ్బు అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి హితబోధ చేశారు. ఆయన వెంట సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐ రవీంద్రబాబు ఉన్నారు.

మతతత్వ పార్టీలను మట్టి కరిపిద్దాం



ఎన్నికల ప్రచారంలో డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ పార్టీలను మట్టి కరిపిద్దామని పంచాయతీ రాజ్ జిల్లా అభివృద్ధి సలహామండలి సభ్యుడు డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని నెహ్రూబజార్, పెద్దమసీదు వీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని ఎన్నికల్లో ఒంటరిగా ఎదుర్కొనే సత్తాలేకనే టీడీపీ అనైతికంగా బీజేపీ, జనసేనలతో అనైతిక పొత్తు పెట్టుకున్నట్లు విమర్శించారు. ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా పని చేస్తున్న టీడీపీ కూటమిని చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. జగనన్న పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని, ప్రస్తుతం అమలవుతున్న పథకాలు యదావిధిగా కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఎస్.వి. చలపతి, హరిత, ఇబ్రహీం, శ్రీనాథరెడ్డి, అబీద్, రమణ, పరమేష్, నాగభూషణం, సునీల్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో ముస్లిం మైనార్టీలకు పెద్దపీట



మసీదులో మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల

కలికిరి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు పెట్టపీట వేయడం జరిగిందని రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. కలికిరి క్రాస్ రోడ్డులోని మసీదులో శుక్రవారం సాయంత్రం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎంపీ, ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి ప్రార్థనలు నిర్వహించి, మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మసీదుల అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నిధులు కేటాయించడం జరిగిందని, భవిష్యత్తులో కూడా మరింత కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం క్రాస్ రోడ్డు హేమాచారి కళ్యాణ మండపంలో మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో స్థానికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రమైనార్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారేసువారిపల్లెలో కార్డెన్ సెర్చ్

300 లీటర్ల నాటు సారా ఊట ధ్వంసం



సారా తయారీ స్థావరాలపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసులు, ఎస్ఎస్‌బీ సిబ్బంది

నిమ్మనపల్లె : నాటుసారా తయారీ స్థావరాలపై ఎస్ఐ లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, ఎస్ ఎస్ బి (స్పెషల్ ఫోర్స్) బలగాలతో శుక్రవారం మండలంలోని ముష్టూరు పంచాయతీ పారేసువారిపల్లె, చల్లావారిపల్లె,లతో పాటు సమీప అటవీ ప్రాంతాలలో ముమ్మరంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటు సారా తయారీ స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించామన్నారు. సారా తయారీ, రవాణా, విక్రయాలపై ఉక్కు పాదం మోపుతున్నామన్నారు. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. సారా తయారీకి పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, పదేపదే నాటు సారా కేసుల్లో పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.ఎస్.బి పోలీస్ సిబ్బంది, స్థానిక పోలీసులు రాజేష్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉపసర్పంచ్ కేశవరెడ్డి

వాల్మీకిపురం : వైఎస్సార్ సీపీదే నియోజకవర్గంలో విజయం ఖాయమని, ఓటింగ్ శాతం పెంచి మెజార్టీ పెంచేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తోటవీధిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచి, వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని, ఎంపిగా మిథున్ రెడ్డిని, సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుని మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి తోడ్పాటు అందించాలన్నారు. గ్రామాల్లో ప్రజాపాలన అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనన్నారు. రాష్ట్రస్థాయి సచివాలయంతో సమానంగా గ్రామస్థాయి సచివాలయం ఏర్పాటుతో ఇంటింటికి ప్రభుత్వ సేవలు చేరువయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, శ్రీనివాసులు, రామక్రిష్టారెడ్డి, మునీశ్వర, ఖాదరి, పులిబ్రదర్స్, కుమార్, శివారెడ్డి, చలపతి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



చావిడికాడపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న చింతల శివానందరెడ్డి

కలకడ : పేదల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని వాల్మీకిపురం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చింతల శివానందరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని నవాబుపేట పంచాయతీ నవాబుపేట, చావిడికాడపల్లె, హరిజనవాడ, గొళ్ళపల్లె, మండెంవారిపల్లె, తదితర గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకే ఓటువేసి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీగా మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్, ఆర్‌బికె చెర్మన్ హరినాథరెడ్డి, నరసింహారెడ్డి కుమార్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శంకర్‌నాయుడు, మస్తాన్‌రెడ్డి, మునిరెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రప్ప, కెఎస్ మస్తాన్, రమణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఒకచోట.. ఏర్పాటు మరొకచోట

మదనపల్లె : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి అనుమతులు ఒకచోట తీసుకుని, మరోచోట కనెక్షన్ తీసుకున్న ఘటన మండలంలో జరిగింది. కొత్తవారిపల్లె పంచాయతీలో రైతు నాగరాజ, సర్వేనెంబర్.8042కు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరైంది. దీనికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌ను అదే పంచాయతీలోని పొలంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా పోతబోలు వీఆర్వో రెడ్డిప్రసాద్... కొత్తవారిపల్లె పంచాయతీకి మంజూరైన విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను తమ పంచాయతీలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఎన్‌ఓసీ మంజూరు చేశాడు. దీనిపై పాలెంకొండకు చెందిన రైతులు శుక్రవారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోతబోలు పంచాయతీలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్తవారిపల్లె పంచాయతీలోనే ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు.

30 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెంచుపాడు పంచాయతీ దాదినాయునితాండాలో సారా విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. స్థానికుడైన కె.సీతారాంనాయక్ (61) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

ముదివేడు తిరునాలకు పటిష్ట ఏర్పాట్లు

కురబలకోట : పడమటి మండలాల్లో ప్రసిద్ధి చెందిన ముదివేడు దండు మారెమ్మ తిరునాలకు పటిష్ట ఏర్పట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి, ఆదివారం పగలు తిరునాల ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల వారు తరలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ముదివేడుతో పాటు మట్లివారిపల్లె, దాదంవారిపల్లె, కడప క్రాస్, వనమరెడ్డిగారిపల్లె, పిచ్చలవాండ్లపల్లె గ్రామాలకు కూడా ముఖ్యమైన దేవతగా అనాదిగా పూజలందుకుంటోంది. ఎన్నికల నేపథ్యంలో తిరునాల నిర్వహణకు మదనపల్లె డీఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ముదివేడు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. గ్రామ సర్పంచ్ షహనాజ్ బేగం, నాయకులు ఎం. ఫిరోజ్‌ఖాన్, ఎం. అంజాద్ ఖాన్ గుడి వద్ద పరిసరాలను జేసీబీతో శుభ్రం చేయించారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

మదనపల్లె సిటీ : గుడ్‌ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు చేశారు. లోకరక్షణకు ఏసు పలికిన ఏడు వాక్యలను పాస్టర్లు ఉపదేశించారు. ప్రభువు సూచించిన ప్రేమ, దయ, జాలి, కరుణ ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. ఏసుక్రీస్తు తన జీవితాన్ని త్యాగం చేసి మానవలోకానికి రక్షకుడిగా మారారని స్థానిక జేసీఎం చర్చి డివిజనల్ ఫాస్టర్ రెవ.డాక్టర్ సునిల్‌వరకుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్దనున్న జెసీఎం చర్చిలో మూడు గంటల పాటు ప్రత్యేక ఆరాధనలు చేశారు. మానవాళి శాంతి కోసం రక్తం చిందించిన ఏసుక్రీస్తు ప్రేమకు గుడ్‌ఫ్రైడే ప్రతీక అన్నారు. ఏసుకు శిలువ వేసిన రోజునే పవిత్ర శుక్రవారంగా జరుపుకుంటామన్నారు. డేవిడ్ సంజయ్ కొరియర్ బృందం ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. ఉపవాసాలతో ఆరాధనలు వచ్చిన భక్తులకు శీతల పానీయాలు అందజేశారు. కార్యక్రమంలో జెసిఎం చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనందకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆరోగ్యవరం మెడికల్‌సెంటర్‌లోని చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. దీంతో పాటు ఆరోగ్యవరం, గుడిసివారిపల్లె, కురవంక, ఈస్టుపేట, బుగ్గకాల్వ ప్రాంతాల్లోని చర్చిలలో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు.

చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు

ములకలచెరువు : మండలంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ములకలచెరువు, బురకాయలకోట, పర్తికోట చర్చుల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పాస్టర్లు సందేశాలను వినిపించారు. బైబిల్‌పైన, ఏసు ప్రభువు ప్రాముఖ్యతను తెలియజేశారు.

సీఎస్ఐ చర్చిలో..

తంబళ్లపల్లె : స్థానిక సీఎస్ఐ చర్చిలో శుక్రవారం క్రైస్తవ సంఘస్తులు గుడ్ ఫ్రై డే ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమానికి మదనపల్లె జేసీయం చర్చి దైవ సేవకులు రెవ , బహదూర్‌సింగ్, హెలిసాలు ఏసు శిలువపై ఏడు మాటలను సంఘస్తులకు భోధించారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు

పెద్దతిప్పసముద్రం : ఏసుక్రీస్తు లోక రక్షకుడని పాస్టర్లు జైదీప్ రాజా, తిమోతి నారాయణలు విశ్వాసులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కందుకూరు, పీటీఎం, పులికల్లు, కొత్తపల్లి తదితర చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రై డే వేడుకలను భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. నేషనల్ క్రిస్టియన్ బోర్డు అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత కందుకూరులో జీసస్ ఇన్ లైఫ్ మినిస్ట్రీ మందిరంలో మాట్లాడారు. సృష్టిలో త్యాగానికి, క్షమా గుణానికి ప్రతీక ఏసు క్రీస్తు అని బోధించారు.



ములకలచెరువు చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

మానవాళి కోసం యేసు శిలువ త్యాగం

కురబలకోట : మానవాళి కోసం క్రీస్తు శిలువ యాగం చేశారని మదనపల్లె హెబ్రోను ప్రార్థన మందిరం సహా పాస్టర్ ప్రకాశం పేర్కొన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు, దైవ సందేశం ఇచ్చారు. ముఖ్య అతిథిగా ఆయన వాక్యోపదేశం చేస్తూ యేసు శిలువలో అవధులులేని త్యాగాన్ని చూపారన్నారు. పాపులను కాదు పాపాన్ని ద్వేషించాలని యేసు బోధించారన్నారు. ఆయన చూపిన సహనం, ప్రేమ, దయ, కరుణ, క్షమ, శాంతి, త్యాగం వంటి విలువలు ఆదర్శనీయమన్నారు.

బసినికొండలో ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు

మదనపల్లె : రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి, మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపిస్తే మరింత మంచి చేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని బసినికొండ పంచాయతీలో పర్యటించిన నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులకు సర్పంచ్ వెంకటరమణ, బావాజాన్ ఆధ్వర్యంలో స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు కలిగిన మేలును వివరించారు. ఎంపీగా మూడోసారి పోటీచేస్తున్న పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. వారికి అధికారమిస్తే మన గొయ్యి మనం తవ్వకున్నట్లేనన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగించిన సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కుల,మత, రాజకీయపార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ఇవ్వడం జరిగిందని, అలాగే గ్రామాలవారీగా అభివృద్ధి పనులు కూడా చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందన్నారు. ఈసారికూడా గతంలో కన్నా ఎక్కువ మెజారిటీతో వైఎస్సార్ సీపీని గెలిపిస్తే ఇప్పుడు చేసిన మంచికి రెట్టింపు మంచి చేస్తామన్నారు. 2014లో టీడీపీ లేనిపోని హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చిందని, ఆ ఐదేళ్ల జన్మభూమి కమిటీలతో ప్రజాధనం దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తుండటంతో మళ్లీ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పేరుతో నేతలు గ్రామాల్లోకి వచ్చి ఏవేవో హామీలు ఇస్తున్నారని, వాటిని నమ్మితే మళ్లీ మోసపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండుకరుణాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు బస్రి, ముబీనా, అమీరున్నీసా, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, రహంతుల్లా, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి కరపత్రాలు ముద్రించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మహబూబ్‌బాషా

పీలేరు : ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికల నిబంధనలకు లోబడి రాజకీయ పార్టీలకు సంబంధించిన కరపత్రాలు ముద్రించాలని తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదైనా రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచార కరపత్రాలు ముద్రించాలంటే ఆర్‌వో అనుమతి తప్పనిసరన్నారు. కరపత్రాలపై ప్రచురణకర్త పేరు, కాపీల సంఖ్య తప్పని సరిగా ఉండాలన్నారు. ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రింటింగ్‌ప్రెస్ యజమానులు గురుస్వామి, ఉత్తమరెడ్డి, అరుణ్‌కుమార్, పూజారి వెంకటేష్, ఆవసాని వెంకటరమణ, మహమ్మద్‌అలి, రమేష్, నారాయణరెడ్డి, శేఖర తదితరులు పాల్గొన్నారు.